# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 21-01-2026** **సమయం : 1.20 గంటలు**

---

# ముఖ్యాంశాలు

1. **అమరావతిని సైబర్ సెక్యూరిటీ నగరంగా తీర్చిదిద్దేందుకు సహకారం అందించాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఇజ్రాయెల్ ప్రతినిధులను కోరారు.**

2. **ప్రజాస్వామ్యంలో శాసన వ్యవస్థ కీలక భూమిక పోషిస్తుందని రాష్ట్ర శాసనసభాపతి చింత కాయల అయ్యన్నపాత్రుడు పేర్కొన్నారు.**

3. **శ్రీకాకుళం అరసవల్లి సూర్యనారాయణ స్వామి రథసప్తమి వేడుకలకు పటిష్ట భద్రతా ఏర్పాట్లను చేస్తున్నామని హోం మంత్రి వి.అనిత తెలిపారు**

4. **ఉత్తరాంధ్ర సాంస్కృతిక వైభవాన్ని, ప్రకృతి పర్యాటకాన్ని తెలిపేలా 'విశాఖ ఉత్సవ్' ను నిర్వహించనున్నామని పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్ వెల్లడించారు.**

==========================

అమరావతిని సైబర్ సెక్యూరిటీ నగరంగా తీర్చిదిద్దేందుకు సాంకేతిక సహకారం అందించాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఇజ్రాయెల్ ప్రతినిధులను కోరారు. ప్రపంచ ఆర్థిక సదస్సులో భాగంగా దావోస్‌లో పర్యటిస్తున్న ముఖ్యమంత్రి ఇజ్రాయెల్ వాణిజ్య, పరిశ్రమల శాఖ మంత్రి నిర్ బర్కత్, ఆ దేశ వాణిజ్య కమిషనర్ రోయ్ పిషర్‌తో సమావేశమయ్యారు. విశాఖ- చెన్నై కారిడార్‌లో యూఏవీ డ్రోన్ల తయారీ, తీరప్రాంత నిఘా, వ్యవసాయ రంగంలో వినియోగానికి డ్రోన్ల తయారీ, వ్యర్థ జలాల పునర్వినియోగ సాంకేతికతపై సహకారాన్ని అందించాలని ముఖ్యమంత్రి కోరారు. అనంతరం ఆంధ్రప్రదేశ్ ప్రజా భాగస్వామ్య ప్రకృతి వ్యవసాయం -ఏపీ సీఎనఎఫ్ నిర్వహించే " పునరుత్పాదక ఆహార వ్యవస్థల ద్వారా భూమి సంరక్షణ" అంశంపై జరిగే చర్చా కార్యక్రమానికి ముఖ్యమంత్రి హాజరుకానున్నారని అధికారులు తెలిపారు.

--------------------------

ప్రజాస్వామ్యంలో శాసన వ్యవస్థ కీలక భూమిక పోషిస్తుందని రాష్ట్ర శాసనసభాపతి చింత కాయల అయ్యన్నపాత్రుడు పేర్కొన్నారు. ఉత్తర ప్రదేశ్ లోని లక్నోలో జరుగుతున్న చట్టసభల సభాపతుల 86వ అఖిల భారత మహాసభలో "ప్రజల పట్ల శాసన వ్యవస్థ జవాబుదారీతనం" అంశంపై ఆయన ఈరోజు ప్రసంగించారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, శాసనసభ తరచూ సమావేశమై ప్రజా సమస్యలపై ప్రశ్నోత్తరాలు, తీర్మానాలు చర్చలు వంటివి నిర్వహించాలన్నారు. ప్రజా ప్రతినిధులు తప్పనిసరిగా సభకు హాజరకావాలని అయ్యన్నపాత్రుడు పేర్కొంటూ,

వాయిస్ 28 సెకన్లు

---------------------------

శ్రీకాకుళం అరసవల్లి సూర్యనారాయణ స్వామి రథసప్తమి వేడుకలకు పటిష్ట భద్రతా ఏర్పాట్లను చేస్తున్నామని హోం మంత్రి వి.అనిత తెలిపారు. శ్రీకాకుళంజిల్లా పర్యటనలో భాగంగా శ్రీకాకుళం పోలీస్ ప్రధాన కార్యాలయాన్ని ఆమె ఈ రోజు సందర్శించారు. అనంతరం అరసవల్లి రథసప్తమికి చేపడుతున్న భద్రతా చర్యలపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, రాష్ట్ర పండుగగా నిర్వహిస్తున్న నేపథ్యంలో భక్తుల రద్దీకి అనుగుణంగా చర్యలు చేపట్టాలన్నారు. సీసీ కెమెరాలు, ట్రాఫిక్ నియంత్రణ, పారిశుద్ధ్యం, ప్రథమ చికిత్స వంటి సదుపాయాలను ఏర్పాటు చేయాలని సూచించారు.

---------------------------

రాష్ట్రంలో ఆయుష్ వైద్య సేవలను ప్రోత్సహించేందుకు కేంద్ర ప్రభుత్వం 5 ఆయుష్ ఆసుపత్రులు మంజూరు చేసిందని పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ వెల్లడించారు. వాటిలో గుంటూరు జిల్లా తెనాలిలో కేంద్ర ప్రభుత్వం ఆయుష్ ఆసుపత్రిని మంజూరు చేసిన నేపథ్యంలో ఆసుపత్రి నిర్మాణానికి మంత్రి నిన్న స్థల పరిశీలన చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ,50 పడకల ఆసుపత్రిని తెనాలి పాత ప్రభుత్వ ఆసుపత్రి ప్రాంగణంలో 26 కోట్ల రూపాయల వ్యయం తో నిర్మాణం చేపట్టనున్నట్లు తెలిపారు. వైద్యశాలలో అత్యాధునిక సౌకర్యాలను ఏర్పాటు చేస్తామని మంత్రి వివరిస్తూ,

వాయిస్ 29 సెకన్లు

---------------------------

దేశానికి కీలకమైన మౌలిక సదుపాయాల ప్రాజెక్టుల అభివృద్ధిలో జాప్యానికి కారణమయ్యే సమస్యలను పరిష్కరించడంలో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ప్రగతి-Active Governance and Timely Implementation- ప్రగతి సమావేశాలు దోహదపడ్డాయి. ఇందులో కేంద్ర బొగ్గు మంత్రిత్వ శాఖకు సంబంధించిన ప్రాజెక్టులు కూడా ఉన్నాయి.

కేంద్ర బొగ్గు మంత్రిత్వ శాఖ దేశంలో బొగ్గు తవ్వకాలతో పాటు సంబంధిత బొగ్గు అనుబంధ రంగాలకి సంబంధించిన కార్యక్రమాలను సమన్వయం చేస్తుంది. జాతీయ ఇంధన అవసరాలకు, విద్యుత్ ఉత్పత్తి, రైల్వేల వంటి కీలక శాఖలకు బొగ్గును అందజేయడంలో కీలక పాత్ర పోషిస్తుంది. ప్రగతి సమావేశంలో ఒక లక్ష 19 వేల కోట్ల రూపాయలకు పైగా విలువైన 16 కీలక ప్రాజెక్టులను ప్రధానమంత్రి నరేంద్ర మోదీ సమీక్షించారు. బొగ్గు మంత్రిత్వ శాఖ పరిధిలోని ప్రాజెక్టుల అమలులో ప్రధానంగా అటవీ, పర్యావరణ అనుమతులు, భూసేకరణ, నిర్మాణ సంబంధిత అనుమతులకు సంబంధించిన సమస్యలతో జాప్యం జరగగా ప్రగతి సమీక్షల సమయంలో ప్రధానమంత్రి జారీ చేసిన ఆదేశాలతో అంతర్-మంత్రిత్వ శాఖలు రాష్ట్ర స్థాయి సమన్వయాన్ని మెరుగుపరిచాయి. తద్వారా జాతీయ ఇంధన పురోగతికి ప్రగతి సమావేశాలు దోహదపడ్డాయి.

---------------------------

ఉత్తరాంధ్ర సాంస్కృతిక వైభవాన్ని, ప్రకృతి పర్యాటకాన్ని తెలిపేలా 'విశాఖ ఉత్సవ్?'ను నిర్వహించనున్నామని పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్ తెలిపారు. విశాఖపట్నంలో నిర్వహించిన విశాఖ ఉత్సవ్ "కర్టెన్ రైజర్" కార్యక్రమంలో మంత్రి నిన్న పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, విశాఖపట్నం -- అనకాపల్లి

-- అల్లూరి సీతారామరాజు జిల్లాలను కలుపుతూ మూడు జిల్లాల్లోని 20 వేదికల్లో 500కు పైగా సాంస్కృతిక, పర్యాటక కార్యక్రమాలను నిర్వహించనున్నామని తెలిపారు. "సాగర తీరాలనుండి కొండ శిఖరాల వరకు" అనే ఇతివృత్తంతో ఈ ఉత్సవం జరుగుతుందని మంత్రి తెలియజేస్తూ,

వాయిస్ 32 సెకన్స్

---------------------------

అనంతపురం జిల్లాను మరింత అభివృద్ధి చేసేందుకు ప్రజా ప్రతినిధులు, అధికారులు, ప్రజలతో కలిసి పని చేస్తానని జిల్లా జాయింట్ కలెక్టర్ సి.విష్ణు చరణ్ అన్నారు. అనంతపురం జిల్లా కలెక్టర్ కార్యాలయంలో ఆయన జిల్లా జాయింట్ కలెక్టర్ గా ఈ రోజు బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా విష్ణు చరణ్ మాట్లాడుతూ అభివృద్ధి , సంక్షేమ పథకాలు, జిల్లాలో కొనసాగుతున్న కార్యక్రమాల ప్రగతికి కృషిచేస్తానని తెలిపారు. ప్రభుత్వ సేవలను ప్రజలకు చేరువ చేస్తూ అందరికీ అందుబాటులో ఉంటానని తెలిపారు.

---------------------------

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలనే లక్ష్యంతో కేంద్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు ఈ నెల 16 వ తేదీ నుండి 31 వరకు 15 రోజుల పాటు దేశవ్యాప్తంగా "స్వచ్ఛత పక్షోత్సవాలు" – స్వచ్ఛతా పక్వాడాను నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రత, ప్లాస్టిక్ రహిత వాతావరణంపై అవగాహన కలిగించడం, సమాజ భాగస్వామ్యం పెంచడం, మొక్కలు సంరక్షణను వంటి కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు. రాష్ట్రంలోని పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో ప్రభుత్వ అధికారులు, ఉద్యోగులు, ప్రజలు పారిశుద్ధ్య పనులు, శ్రమదాన కార్యక్రమాలను చేపడుతున్నారు.

---------------------------

ప్రధానమంత్రి నరేంద్రమోదీ తన మనసులోని భావాలను ఆకాశవాణి ద్వారా దేశ ప్రజలతో పంచుకునే "మన్ కీ బాత్" మనసులోని మాట కార్యక్రమం 130వ సంచిక ఈనెల 25వ తేదీ ఆదివారం ప్రసారమవుతుంది."మన్ కీ బాత్" కార్యక్రమానికి ప్రజలు తమ సూచనలు అందించాలని ప్రధానమంత్రి కోరారు. ప్రజలు తమ స్వర సందేశాలను 1800 11 7800 నెంబర్‌కు ఈనెల 23వ తేదీ వరకు పంపవచ్చు.

---------------------------

పార్వతీపురం మన్యం జిల్లాలోని సాంఘిక సంక్షేమ వసతి గృహాలలో మౌలిక వసతుల కల్పనకు చర్యలు తీసుకుంటున్నామని జిల్లా కలెక్టర్ ఎన్. ప్రభాకర రెడ్డి పేర్కొన్నారు. పార్వతీపురం లోని కలెక్టర్ కార్యాలయంలో సాంఘిక సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో వసతి గృహాలకు 'వాటర్ ప్యూరిఫైర్'లను ఆయన ఈ రోజు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ.. జిల్లాలోని 13 వసతి గృహాల్లోని విద్యార్థులకు స్వచ్ఛమైన తాగునీరు అందించేందుకు అత్యాధునిక "వాటర్ ప్యూరిఫైర్"లను ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. అలాగే విద్యార్థుల సమగ్ర వికాసం కోసం వసతి గృహాల్లో చదువుతో పాటు యోగాసనాలు, క్రీడలకు ప్రాధ్యానిస్తున్నామని జిల్లా కలెక్టర్ పేర్కొన్నారు.

====================